క్లుప్తంగా

విశ్వరూప అవతారంలో శ్రీవారు

రాయవరం: స్థానికంగా కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని శనివారం విశ్వరూపావతారాల్లో అలంకరించారు. ఆలయంలో గత నెల 23 నుంచి దశావతార మహోత్సవాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. వైఖానస ఆగమ విధానంలో అంగర శోభనాచార్యులు అర్చకత్వంలో శ్రీవారికి ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీవారిని విశ్వరూపావతారాల్లో అలంకరించారు. రాత్రి సమయంలో స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

దీపారాధన స్టాండ్ల సమర్పణ

రాయవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి దాతలు శనివారం దీపారాధన స్టాండ్లు సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులు దీపారాధనలు చేసుకునేందుకు వీలుగా గ్రామానికి చెందిన దేవళ్ల వీరవెంకట సత్యనారాయణచౌదరి రూ.45 వేల విలువైన దీపారాధన స్టాండ్లు అందజేశారు. అలాగే మల్లిడి శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆలయానికి రూ.50 వేల విలువైన సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్ అందజేశారు. స్వామివారికి బంగారు ఆభరణాల నిమిత్తం ఆంధ్ర పెద వీర్రాజు అనే దాత రూ.లక్ష విరాళంగా అందజేశారు. అనంతరం ముక్కోటి ఏకాదశి ఉత్సవ కమిటీ సభ్యుల చేతుల మీదుగా వైకుంఠ ద్వార దర్శనం వార్షికోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, స్థానిక నేతలు పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్), సత్తి వెంకట సుబ్బారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి (మెడికల్ షాపు శ్రీను) తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత



ద్రాక్షారామలో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ద్రాక్షారామకు చెందిన చేల్లే శ్రీనివాసరావు(శాస్త్రి) కుటుంబ సభ్యులకు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి లైటింగ్, డెకరేషన్ టెంట్, సౌండ్ సిస్టమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్టల్ ఇన్సూరెన్స్ ద్వారా అందిన రూ.10 లక్షల సొమ్మును శనివారం అందజేశారు. ద్రాక్షారామ దుర్గా కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పెట్టా చినబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు సిరి శ్రీను, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావులు బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు శాకా బాబీ, కార్యదర్శి వాసంశెట్టి చినబాబు, వివిధ మండలాల సభ్యులు పాల్గొన్నారు.

పరస్పర అంగీకారంతోనే భూ సమస్యలకు పరిష్కారం

కాజులూరు: గ్రామాల్లో రైతులు పరస్పర అంగీకారంతోనే వ్యవహరించినప్పుడే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని ఆర్ఐ వేగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని చేదువాడలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చుతగ్గులను సరిచేసుకునేందుకు ప్రభుత్వం ఈ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. సరిహద్దు తగాదాల విషయంలో రైతులు పరస్పరం అంగీకారంతో సమస్యలు ఉత్పన్నం కాకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై నాలుగు దరఖాస్తులు అందినట్టు ఆర్ఐ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మూర్తి, స్థానిక వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించవద్దు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: విద్యార్థులను ఫీజుల పేరుతో వేధిస్తే ఉపేక్షించేది లేదని, వారికి ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ మంజూరు చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం మంత్రి సుభాష్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,48,419 మంది విద్యార్థులకు ఈ పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకానికి రూ. 27.39 కోట్లు ఖర్చు చేస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరంలో రూ. 85.84 కోట్లు ఖర్చు చేయనున్నట్టు ప్రకటించారు. జూన్ నాటికి 'తల్లికి వందనం' అమలు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరంలోగా మెగా డీఎస్సీ నియామకాకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించి, వారితో భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అఖిల, కూటమి నాయకులు, అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ పనులు

- వెదజల్లు వైపు రైతుల చూపు
- 95 శాతం వెదజల్లు సాగవుతుందని అధికారుల అంచనా



పసలపూడిలో వెదజల్లు విధానంలో వరి విత్తనాలు జల్లుతున్న కౌలు రైతు

రాయవరం: రబీ సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండపేట నియోజకవర్గంలో ఖరీఫ్ వరికోతలు దాదాపు పూర్తి కావచ్చాయి. ప్రస్తుతం రైతులు రబీ పనుల్లో భాగంగా వరి నారుమళ్ల తయారీ, వెదజల్లు సాగు పనులను చేపడుతున్నారు. గత ఖరీఫ్‌లో కూడా రైతులు ఎక్కువగా వెదజల్లు విధానంలో సాగు చేయగా, ప్రస్తుత రబీలో కూడా వెదజల్లు సాగుకే రైతులు, కౌలు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. వెదజల్లు విధానంలో సాగు చేయడం వలన ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగా పెరిగే అవకాశం ఉంది. ఈ విషయం ఖరీఫ్‌లో కూడా నిరూపితమైంది. దీంతో ఏటేటా పెరుగుతున్న వెదజల్లు విధానం ఈ ఏడాది కూడా మరింత పెరుగుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పంట సాగులో 95 శాతం వెదజల్లు విధానంలో సాగవుతుందని భావిస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 1.01 లక్షల ఎకరాల్లో రబీ సాగు చేపడుతున్నారు.

వెదజల్లుతో ప్రయోజనాలివే..

వెదజల్లు సాగు వలన విత్తన ఖర్చు ఎకరానికి 18 కేజీలు ఆదా అవుతుంది. నారు తయారుకు ఎకరానికి అయ్యే ఖర్చు రూ.రెండు వేలు మిగులుతుంది. నాట్లు వేసే సమయంలో వరినారు తీయడానికి, నాట్లు వేసేందుకు కూలీలకు అయ్యే ఖర్చు ఎకరానికి సుమారుగా రూ.3,000 ఆదా అవుతుంది. ముఖ్యంగా కూలీల కొరతను అధిగమించవచ్చు. విత్తనాలను వెదజల్లడం వలన విత్తనాలు పైపైనే పడి తొందరగా, అధికంగా పిలకలు వస్తాయి. ఒక్కొక్క మొక్క ఉండడం వలన పోషక విలువలన్నీ మొక్కకు సమంగా అందుతాయి. గాలి, వెలుతురు సమంగా ప్రసరించడం వలన పంట ఆరోగ్యకరంగా పెరిగి చీడపీడలు తక్కువగా ఆశిస్తాయి. ధృడమైన పిలకలు ఎక్కువగా ఉండడంతో సాధారణ పద్ధతిలో నాట్లు వేయడం కన్నా ఐదారు బస్తాల అధికంగా దిగుబడి వస్తుంది. వెదజల్లులో వచ్చిన అన్ని పిలకలకు సమానంగా వెన్నులు రావడం వలన అధిక దిగుబడులు వస్తాయి. పురుగు మందుల వాడకం తగ్గి నాణ్యమైన ఉత్పత్తులు సాధించడమే కాకుండా సాగు ఖర్చు కూడా తగ్గుతుంది. తక్కువ నీటితో సాగు చేయడానికి అవకాశం ఉంటుంది. ఒక్కొక్క పిలక ఉండడం వలన పోషక విలువలు బాగా తీసుకుని దిగుబడి నిచ్చే కంకులు అధికంగా వస్తాయి.

సాధారణ పద్ధతిలో నాట్లు వేస్తే..

సాధారణ పద్ధతిలో నాట్లు వేసే పద్ధతిలో కుదురుకు కుదురుకు నాలుగైదు మొక్కలు ఉండడం వలన పోషక విలువలు సక్రమంగా అందవు.నాట్లు లోపలకు వెళ్లడం వలన పిలకలు ఆలస్యంగా వస్తాయి. పోషకాలు సమంగా అన్ని మొక్కలకు అందవు.

రబీకి మరింత అనుకూలం

వెదజల్లు సాగును రబీలోనే రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. వెదజల్లు సాగు చేయడం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. రబీలో నీటి ఎద్దడి ఎదురైన పరిస్థితుల్లో ఈ విధానం ఎంతో మంచిది. వెదసాగు చేపట్టడం వలన ఏడాదిలో రైతులు మూడు పంటలు వేసుకోవడానికి వీలవుతుందన్నారు. కూలీల సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వెదజల్లు సాగే మేలని సూచిస్తున్నారు. సాధారణ పద్ధతిలో కంటే ముందే పంట కోతకు వస్తుంది. తుఫాన్ల బారి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

సమయం ఆదా అవుతుంది



రైతులు ఎట్టి పరిస్థితుల్లో రబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. రబీలో వెదజల్లు విధానం ఎంతో మేలు చేకూరుస్తుంది. ఆర్‌బీకేల పరిధిలో ఇప్పటికే రైతులకు టాంటాం వేయించాం. వెదజల్లు సాగును చేపట్టడం వలన కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నాం. వెదజల్లు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. 95 శాతం మేర వెదజల్లు సాగు జరిగే అవకాశం ఉంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం.

వాడీవేడిగా మండల సమావేశం

నర్పంచ్‌లపై తప్పుడు కేసులు ఆపాలని నినాదాలు



రామచంద్రపురం మండల సమావేశంలో సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం 2024–25 బడ్జెట్ సమావేశం శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వాడీవేడిగా జరిగింది. ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తొలుత గ్రామ సర్పంచ్‌లు నల్లబ్యాడ్జీలు ధరించి సర్పంచ్‌లపై అక్రమ కేసులు ఆపాలని నినాదాలు చేస్తూ సమావేశ మందిరంలో ప్రవేశించారు. వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం ఇటీవల వెంకటాయపాలెం, తాళ్లపొలం సర్పంచ్‌లు యల్లమిల్లి సతీష్ కుమారి, కట్టా గోవిందులపై నమోదు చేసిన తప్పుడు కేసులపై సభ దృష్టికి తీసుకువచ్చారు. రాజకీయ, వ్యక్తిగత కారణాలతో తప్పుడు కేసులు బనాయించడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని, ప్రశాంతంగా ఉండే పల్లెల్లో అశాంతి రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలని నిరసన తెలిపారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. మండల కార్యాలయంలో జరిగిన సమావేశాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేవనెత్తిన సమస్యలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ భవాని, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులపై మండిపడ్డారు. వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం మాట్లాడుతూ దాళ్వాలో రైతులకు అవసరమైన ఎరువులు ఆర్‌బీకేలలో ఇండెంట్ ఎందుకు పెట్టడం లేదంటూ ఏఓ సత్యప్రసాద్‌ను ప్రశ్నించారు. దీనిపై ఏఓ బదులిస్తూ ఇండెంట్ పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాపవరం ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల వ్యవహారల్లో అవినీతిపై ప్రశ్నిస్తూ గ్రామాల్లో పరిశీలిస్తే అన్ని బయట పడతాయని చాలెంజ్ చేశారు. పలు సమస్యలపై పలువురు సభ్యులు అధికారులకు ప్రశ్నలు సంధించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- సమస్యలపై అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు
- ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సుభాష్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి నివేదికను సభ్యులకు వివరించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్, వెలుగు, ఎంజీఎన్ఆర్‌జీఎస్, వైద్య, విద్య తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదిక చదివి సభలో వినిపించారు. అయితే ఆయా శాఖలకు చెందిన సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల వద్ద రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. కోట సర్పంచ్ సునీత మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి చెరువు ఉందని ప్రస్తుతం చెరువు పూడికతీతతో ఉండడం వల్ల తాగునీరు సరఫరాలో జాప్యం జరుగుతుందన్నారు. వెంటనే మండల పరిషత్ నిధులు వెచ్చించి చెరువును బాగు చేయాలని కోరారు.

మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం

సర్వసభ్య సమావేశానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతు రానున్న కాలంలో మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ప్రతి గ్రామంలో శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డు నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. క్రమక్రమంగా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. సాగు, తాగునీరు సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమన్వయంతో పని చేయాలి

మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో భాగస్వాములై ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ఏదైనా సరే ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి వారితో కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. వరిసాగు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ మృత్యుంజయరావు, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న ఎస్పీ విక్రమ్ పాటిల్ దంపతులు

రామచంద్రపురం రూరల్: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రమ్ పాటిల్ దంపతులు శనివారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

బాబాకు ఎమ్మెల్సీ తోట పరామర్శ



బాబాను పరామర్శిస్తున్న త్రిమూర్తులు తదితరులు

మండపేట: మాతృ వియోగంతో బాధపడుతున్న షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబాను శనివారం శాసన మండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు పరామర్శించారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న బాబా నివాసానికి తోట త్రిమూర్తులు వెళ్లి ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ ఇమామ్ షా, నాయకులు పాల్గొన్నారు.

పాలతోడులో పశు వైద్య శిబిరం

మండపేట: పాలతోడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామంలోని రైతులు తీసుకొచ్చిన పశువులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ పిల్లా అరవలక్ష్మి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కోరుకొండ శ్రీనివాస్, గ్రామస్తులు పిల్లా తాతీలు, గుణ్ణం సత్యసాయిబాబా, అన్నందేవుల సూర్యచంద్రరావు, బి.నాగేశ్వరావు, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సంక్షేమానికి ఓఎన్జీసీ పాటు పడాలి

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలో గ్యాస్ తవ్వకాలు చేస్తున్న ఓఎన్‌జీసీ గ్రామాభివృద్ధికి పాటు పడాలని మాజీ ఎంపీపీ నెక్కంటి బాలకృష్ణ (కిశోర్ బాబు) కోరారు. ఆ మేరకు శనివారం మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామంలో రిగ్ నిర్వహణ కొనసాగుతోందన్నారు. గ్రామాన్ని పట్టి పీడిస్తున్న డంపింగ్ యార్డు నిర్మాణ సమస్యకు ఓఎన్‌జీసీ నిధులు వెచ్చించాలని కోరారు. రోడ్లు తరచూ ఛిద్రమవుతున్న నేపథ్యంలో ఓన్జీసీ రహదారిని సీసీ రహదారిగా మెరుగుపరచాలని బాలకృష్ణ కోరారు.

దివ్యాంగులపై ఆదరాభిమానాలు ఉండాలి



కాజులూరులో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దివ్యాంగ చిన్నారులు, తల్లిదండ్రులు



సోమేశ్వరంలో లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి నివాళులు

కాజులూరు: దివ్యాంగులపై సమాజంలో ప్రతి ఒక్కరూ ఆదరాభిమానాలు కలిగి ఉండాలని కాజులూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి అన్నారు. గ్రామంలోని భవిత కేంద్రంలో శనివారం బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివ్యాంగుల పాఠశాల ఐఈఆర్‌పీ ఎం.జయప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బ్రెయిలీ లిపి వల్ల అంధులకు ఎంతో ఉపయోగకరమన్నారు. పాఠశాలలో ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ మెయిన్ పాఠశాల హెచ్ఎం యూఆర్ పద్మావతి, ఉపాధ్యాయులు, ఐఈఆర్‌పి సిబ్బంది శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమక్షంలో

రామచంద్రపురం రూరల్: మండలంలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల సమక్షంలో లూయిస్ బ్రెయిలీ జన్మ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ వి.నాగేశ్వరి మాట్లాడుతూ బ్రెయిలీ పుట్టుకతో అంధుడైనప్పటికీ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుకుని అంధుల కోసం ప్రత్యేకమైన లిపిని తయారు చేశాడన్నారు. దివ్యాంగులైన చిన్నారులను వారి తల్లిదండ్రులు బాగా చదివించి ఉన్నత స్థాయిలో నిలబడడానికి తోడ్పాటు అందజేయాలని సూచించారు. భవిత కేంద్రంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం రిసోర్స్ టీచర్లు బాబు, నాగమణి, దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

రాయవరం: సోమేశ్వరం భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ లిపి దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి ఐఈఆర్‌పీలు పి.ఆదర్స్, టి.వీరవేణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లూయిస్ బ్రెయిలీ జీవిత చరిత్రను, బ్రెయిలీ లిపి విశిష్టతను వారు వివరించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్ర పటంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సేద్యం.. బకాలకు భోజ్యం



రాయవరం: రబీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ట్రాక్టర్లతో దమ్ములు ప్రారంభించారు. భూమిని దున్నే సమయంలో నేల అడుగు భాగం నుంచి బయటకు వచ్చే పురుగులను ఆహారంగా తీసుకునే కొంగల (బకంలు)కు విందు భోజ్యంగా మారింది. ఒక పక్క ట్రాక్టరు దమ్ము చేస్తుండగా వందల సంఖ్యలో ఉన్న కొంగలతో పంట చేను శ్వేత భూమిగా మారిన దృశ్యం చూపరులను సంభ్రమాశ్చర్య చకితులను చేస్తోంది. రాయవరం గ్రామ పరిసరాల్లో పంట చేనును దమ్ము చేస్తున్న సమయంలో ఆహారం కోసం కొంగలు వెంటపడుతున్న చిత్రమిది.

నూతన ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడు గ్రామం నుంచి ద్రాక్షారామ మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సు నూతన సర్వీసును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ నెలపర్తిపాడు గ్రామస్తులు ఆర్టీసీ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయుడు సీతా మహాలక్ష్మి, ఆర్డీఓ దేవరకొండ అఖిల, ఆర్టీసీ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు, డీపీటీఓ ఎన్.శ్రీనివాసరావు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూస్తున్న రాయవరం ఎంపీపీ వెంకటరమణ తదితరులు



మండపేటలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



కాజులూరులో మధ్యాహ్న భోజన పథకం సభలో ప్రసంగిస్తున్న మంత్రి సుభాష్

రాయవరం: ఇంటర్మీడియేట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుచి, శుచిగా ఆహార పదార్థాలు తయారు చేసేలా కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, హెచ్ఎం సునీతలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ వెంకటరమణ తదితరులు మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం వీఎస్ సునీత, స్థానిక నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపేట: స్థానిక ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి డొక్కా సీతమ్మ పేరు నిలబెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే జోగేశ్వరరావు భోజనం వడ్డించారు. వారితో కలసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ కె. అప్పలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ హరికోటి శాస్త్రి,ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లితండ్రులు పాల్గొన్నారు.

కె.గంగవరం: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. మండలంలోని పామర్రులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని వారు ప్రారంభించారు. కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థి చదువు నిమిత్తం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. అనంతరం వాసంశెట్టి సత్యంతో కలసి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు వడ్డించారు. అనంతరం వారు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గ్రామ పెద్దలు, ఎంఈఓ ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర, మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మాచర పాఠశాలలో 14 మంది, అంగర పాఠశాలలో 12 మంది మొత్తం 26 మంది చదువుతున్నారు. కాగా తొలిరోజు 17 మంది భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాజులూరు: విద్యాభివృద్ధితోనే సమాజం పురోగతి చెందుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతవిద్యను అభ్యసించాలన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: టేకి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించారు. గ్రామంతో పాటు కోరుమిల్లి, మాచర, యండగండి తదితర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. **ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.